కొంచెం కరివేపాకు కూడా పెట్టించమ్మా. మార్కెట్టుకు వెళ్ళడానికి యిప్పటికే చాలా టైమయింది." అన్నాది ఆయిల్లాలు.

ఇంక ఉండబట్టలేక "ఈ రోజు ఆదివారము. ఆఫీసులుండవు. మా ర్కెటుకి వెళ్లండి తాపీగా వండండి" అన్నాను.

"ఆఁ ఈ రోజు ఆదివారమాఁ నా మతి మండా" అని నోరుతెరిచింది ఆశ్చర్యంగా ఆ ఇల్లాలు. ★

# మధురఘట్టం



## ధరణిప్రగడ వెంకటశేషగిరిరావు

మా కాలేజీ ఉదయం మాత్రమే పనిచేస్తోంది.

మధ్యాహ్నం ఎవరికో పరీక్షలు జరుగుతుండడంవల్ల మాకు సెలవు.

కాలేజీ ఉదయం ఏడున్నరకు ప్రారంభం అవుతున్నా నేను త్వరగా తయారయి ఏడింటికే కాలేజీ ఆవరణలో ప్రవేశించాను. సూర్యుడి పసిడి కిరణాలు పచ్చికమీద మంచుబిందువులను ముత్యాల్లా ప్రకాశింపజేసున్నాయి. మా క్లాసువైపు నడిచాను. మా క్లాసుకి ఇరువైపులా రెండు పసుపు పూల చెట్లున్నాయి. వాటి నుంచి రాలిన పూలు క్రింద పసుపుపచ్చని తివాసీల్లా ఉన్నాయి. అక్కడక్కడ పైకి లేచిన గడ్డిపరకలు ఆ తివాసీల మధ్య ఎంబ్రాయిడరీ డిజైనులా కనిపిస్తోంది. ఆ పచ్చిక పరకల పైనున్న మంచు బిందువులు తివాసీ మధ్య ముత్యాలు పొదిగినట్లున్నాయి.

క్లాసు రూములో అడుగు పెట్టిన నేను అప్రయత్నంగా చివరి బెంచికేసి చూశాను. నల్లని నిగనిగలాడే వెంట్రుకలు, మీనాల్లాంటి కళ్ళు నన్నాకర్షించాయి. నన్ను చూసి ఆ కళ్ళు బెదురుతూ చలించాయి. శరీరం బెదురుతో కంపించింది.

మేమిద్దరం తప్పితే క్లాసులో మరి ఎవ్వరూ లేరు. అప్పటికే పనిమనిషి క్లాసు రూము తుడిచివెళ్ళింది.

మెల్లిగా నా సీటుకేసి నడిచాను. నన్ను చూసి మెల్లిగా లేచి నుంచుంది నేను పుస్తకాలు డస్కులో పడేసి. అలాగే నుంచుని చూశాను. మెల్లిగా బయటికి నడిచింది. జాలిగా చూశాను.

నేను నిన్నేమీ చేయనని చెపుదామనుకున్నాను. నేను చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో లేదని నాకు తెలుసు. అందుకే నేనసలు మాట్లాడలేదు. వెనుకగా బయలుదేరాను. నేను వెనుక రావడం గమనించి చిన్న పరుగులాంటి నడక నడిచి, పసుపు పూల తివాసీలా ఉన్న ఒక చెట్టు క్రిందకి వెళ్ళి నుంచుంది. బెదురుగా నాకేసి చూసింది.

ఆ దృశ్యం నా హృదయాన్ని ఆకట్టింది. చిత్రం గీసుకోవాలనిపించింది. అనేక కోణాలలో ఫొటో తీయాలనిపించింది. కానీ, నేను వచ్చింది కాలేజీకి. ఇక పావుగంటలో క్లాసులు ప్రారంభమవుతాయి. విద్యార్థులు ఒక్కొక్కరే వస్తున్నారు.

నేనుకూడా ఆ చెట్టుకేసి నడిచాను. "నా వెంటబడుతున్నావేమిటీ ?" అన్నట్టుగా ఒకసారి నాకేసి చూసింది. మెల్లిగా కదలి కొంతదూరంలోవున్న మామిడి చెట్టు క్రింద ఆగింది. నేను అప్రయత్నంగా ముందుకు నడిచాను. నేనా చెట్టు క్రిందకు చేరేసరికి బెదురుతో చెట్టు ఆవలివైపు వెళ్ళి నిలబడింది. భయంగా చుట్టూ కలయజూసింది. నేను తప్పితే చుట్టుప్రక్కల ఎవరూలేరు. వెనక్కువెళ్ళే అవకాశం లేకుండా వెనక ప్రహరీగోడ ఉంది. ఇక నేటితో తన బ్రతుకు సరి అనుకున్నట్టుగా నావైపు చూసింది.

నేను క్రిందకున్న మామిడి కొమ్మ విరిచి చేతితో పట్టుకుని మెల్లిగా అటూ యిటూ ఊపుతూ చిరునవ్వు నవ్వాను. నేను వేసిన ఆ మంత్రం ఫలించింది. ఆ కళ్ళలో బెదురు తగ్గింది. మెల్లిగా నాకేసి వచ్చింది. దగ్గరగా రాగనే కొమ్మ క్రింద పడవేసి రెండు చేతులతో నడుము పట్టుకున్నాను. తరువాత ఒక చేయి తీసి క్రిందనున్న మామిడి కొమ్మ తీసి నోటి దగ్గర ఉంచి ఒళ్ళు నిమిరాను. మెల్లిగా ఆ కొమ్మనున్న ఆకులు తినడం ప్రారంభించిందా మేకపిల్ల. నా మనసు ఆనందంతో గెంతింది. ఇంతలో బెల్ మ్రోగడంతో మా క్లాసుకేసి నడిచాను. నాతో కొంతదూరం వచ్చి ఆగిపోయింది. వెనక్కు తిరిగి చూశాను. ఆ కళ్ళలో ధైర్యం కన్పించింది నాకు. ❁

